# 10. నాకే రెక్కలు వస్తే

కింది బొమ్మను చూడండి, మాట్లాడండి.



SCERT TELANGANA

ప్రశ్నలకు జవాబులు చెప్పండి

- పై బొమ్మలో ఏం కనిపిస్తుంది?
- చెట్లు అట్లా నడవడం జరిగితే ఏమౌతుంది?
- నడిచే చెట్టు మీకు ఎదురైతే మీరు ఏం మాట్లాడుతారు?



విద్యార్థులకు సూచనలు

- పాఠంలోని బొమ్మలు చూడండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులనుగాని, ఉపాధ్యాయులనుగాని అడగండి. లేదా **'పదాలు-అర్థాలు'** అనే పట్టికలో చూసి తెలుసుకోండి.



అనగనగా ఒక అందమైన ఊరు. ఆ ఊరి చివరలో ఒక అందమైన కొండ. కొండకు ఒకవైపు మైదానాలు, పంటపొలాలు. మరొకవైపు వాగులు, వంకలు. కొండపైన అక్కడక్కడ పచ్చటి చెట్లు, ఆ చెట్లపైన రకరకాల అందమైన పక్షులు. కొండ అంచున మేసే పశువులు. మైదానంలో ఆడుకొనే పిల్లలు. పొలాల్లో పనిచేసే రైతులు... మొదలైన వాటన్నిటితో ఆ కొండ చుట్టూ ఉండే పరిసరాలు ఎంతో ఆహ్లాదంగా, ఉల్లాసంగా ఉండేవి. వీటన్నిటినీ చూస్తూ కొండ ఎంతో సంతోషంగా, ఉత్సాహంగా ఉండేది.

ఒకరోజు కొండకు కల వచ్చింది. ఆ కలలో పక్షులన్నీ కలిసి ఆకాశంలో గుంపుగా ఎగురుతూ వెళ్ళడం చూసింది. "అబ్బా! ఎంత అందంగా ఎగురుతున్నాయి పక్షులు. అవి వాటి ఇష్టం వచ్చిన చోటుకి స్వేచ్ఛగా ఎగిరి వెళుతున్నాయి. నేను మాత్రం ఎప్పటికీ ఒకేచోట కదలక మెదలక పడి ఉండాలి." అని అనుకుంటూ బాధపడింది కొండ. అలా బాధపడుతూ దేవుని ప్రార్థించి "నాకూ రెక్కలు ఉంటే బాగుంటుంది" అని కోరుకుంది.

ఆశ్చర్యం...!!!

కొండకు రెక్కలు వచ్చేశాయి. కొండ ఆనందానికి అవధులులేవు. "ఆహా! నేను కూడా ఎగురుతా! ప్రపంచం చూసివస్తా!" అనుకుంటూ కొండ ఎగురసాగింది. ఒక అందమైన గుడిసెను చూసింది. "ఈ గుడిసెలోకి వెళ్ళి వారితో మాట్లాడుతా!" అనుకుని, కొండ గుడిసెపై వాలింది. అంతే!

"ధభేల్... ...!" అంటూ గుడిసె అప్పడం అయిపోయింది. అందరూ భయంతో పరుగులు తీసారు. కొండ కంగారుపడింది.

SCERT TELANGANA



అక్కడి నుంచి లేచి మరొకవైపుకు ఎగిరింది. దానికి ఒక చెరువు కనపడింది. ఆ చెరువులో కేరింతలుకొడుతూ, ఈత కొడుతూ ఆడుకొంటున్న పిల్లలను చూసింది. దానికి కూడా ఈత కొట్టాలనిపించింది. అమాంతం చెరువులో దిగింది. ఇంకేముంది? దాని బరువుకు చెరువుకట్ట తెగిపోయి నీరంతా ఊర్లోకి పారింది. పిల్లలంతా వెనక్కి తిరిగి చూడకుండా పరుగో పరుగు. "అయ్యో!" అనుకుంటూ కొండ అక్కడి నుంచి బయలుదేరింది.

అలా ఎగురుతూ పట్టణంవైపు దారితీసింది. పట్టణంలో రోడ్లు, బంగళాలు, వాహనాలను అబ్బురంగా చూస్తూ ఎగురసాగింది. అది చూసిన జనం అయోమయంతో అటూ ఇటూ పరుగులు పెట్టసాగారు. వాహనాలు నడిపేవారు కూడా కొండను చూసి భయపడి అడ్డదిడ్డంగా వెళ్ళడం మొదలుపెట్టారు.

దానితో రోడ్లమీద మొత్తం ట్రాఫిక్ జామ్ అయిపోయింది. ఇదంతా చూసిన ట్రాఫిక్ పోలీసులు "ఈ కొండ ఇక్కడికి ఎలా వచ్చింది? ఇది ఇక్కడ ఉండడం మంచిదికాదు. దీనిని పేల్చివేయాలి" అంటూ అధికారులకు ఫోన్‌చేసి కొండను పేల్చడానికి బాంబులు పంపమని అడిగారు.

అది విన్న కొండ, ప్రాణభయంతో పరుగోపరుగు. "నాకు రెక్కలు వచ్చి ఎగరడం ఎవ్వరికీ ఇష్టంలేదు." అనుకుంటూ, తిరిగి తన స్థానంలోకి వచ్చేసింది. "అబ్బ! ఇప్పుడు ఎంత ప్రశాంతంగా ఉంది. చుట్టూ చెట్లను, పొలాలను, పక్షులను, ఆకాశాన్ని చూసుకొంటూ ఉంటే ఎంత హాయిగా ఉందో! నాకు వద్దు బాబూ ఈ రెక్కలు" అనుకున్నది.



ఇంతలో కొండకు తెలివి వచ్చింది.

అమ్మయ్యా! ఇదంతా కలకదా! అనుకున్నది.

SCERT TELANGANA

# భాషాసామర్థ్యాల సాధన

## I వినడం-ఆలోచించి మాట్లాడడం

అ) కొండ అలా రెక్కలు కావాలని కోరుకోవడం సరియైనదా? కాదా? ఎందుకు?

ఆ) మీకు అట్లా రెక్కలు వస్తే ఏం చేయాలను కొంటారు? ఏమేం చేస్తారు?

## II ధారాళంగా చదువడం - అర్థం చేసుకోవడం

**అ) కింది వాక్యాలను చదువండి. పాఠం ఆధారంగా అవి తప్పు (×) ఒప్పు (✓) లను గుర్తించండి.**

1) కొండ చుట్టూ ఉండే పరిసరాలు చాలా ఆహ్లాదంగా ఉండేవి. ( )

2) ఒకరోజు కొండ ఆకాశంలో ఎగిరే గాలిపటాలు చూసింది. ( )

3) గుడిసెను కూలగొట్టడానికే కొండ గుడిసెమీద వాలింది. ( )

4) పట్నంలోని బంగళాలను, వాహనాలను కొండ అబ్బురంగా చూసింది. ( )

5) తనను పేల్చివేస్తామని అన్న పోలీసులతో కొండ గొడవపడింది. ( )

**ఆ) కింది పేరా చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ఒక దట్టమైన అడవి మధ్యలో ఒక అందమైన మామిడి చెట్టు ఉండేది. దానిమీద పక్షులూ, కోతులూ, చీమలూ, ఉడుతలూ... మొదలైనవి నివసిస్తూ ఉండేవి. వాటన్నిటితో చెట్టు స్నేహం చేసింది. అవన్ని చెప్పే ముచ్చట్లు వినడం చెట్టుకు చాలా ఇష్టం. ఒక రోజు చెట్టు మీరు ఎక్కడి నుంచి వస్తున్నారని పక్షులను అడిగింది. "ఆహారం కోసం గింజలు, గూడు కట్టుకోవడం కోసం పుల్లలు ఏరుకొని వస్తున్నాం" అని చెప్పాయి పక్షులు. అలాగే కోతులను కూడా అడిగింది చెట్టు. ఒక కోతి "నేను గుడి దగ్గరకు వెళ్ళి కొబ్బరి ముక్కలు అరటిపండ్లు తెచ్చుకున్నా" అని చెప్పగా, మరొక కోతి "నేను తోటకు వెళ్ళి జామకాయలు తెచ్చుకున్నా" అని చెప్పింది. అలాగే చీమలు "ఆహారం తెచ్చుకొన్నాం" అని, ఉడుతలు "ఉసిరికాయలు తెంపి వస్తున్నాం!" అని చెప్పాయి. ఇవన్నీ విన్న చెట్టు నిట్టూర్చి "వీరందరూ బయటకి వెళ్ళి వస్తారు. నేను మాత్రం ఎక్కడికీ వెళ్ళలేను!" అనుకున్నది.

SCERT TELANGANA

1) చెట్టు మీద ఏమేం నివసించేవి?

2) పక్షులు దేనికోసం బయటికి వెళ్ళాయి?

3) కోతులు బయటకు వెళ్ళి ఏమేం చేసి వచ్చాయి?

4) చెట్లవల్ల ఏమేం ఉపయోగాలు ఉంటాయి?

5) అన్నీ చెప్పిన విషయాలు విన్నాక చెట్టు ఏమనుకుంది?

## III సొంతంగా రాయడం

**అ) కింది ప్రశ్నలకు జవాబులను రాయండి.**

1) కొండకు రెక్కలు వచ్చి ఎగురడంవల్ల ఏం జరిగింది?

2) మీరు కొండలాగా కదలకుండ ఒకే చోట ఉంటే ఎలా ఉంటుందో రాయండి.

## IV సృజనాత్మకత

**అ) కొండ గుడిసెమీద వాలగానే గుడిసె కూలిపోయింది కదా! అలా కాకుండా ఉంటే, కొండ గుడిసెలోని వారితో ఏం మాట్లాడి ఉండేదో సంభాషణ రాయండి.**

కొండ : బాగున్నారా బాబూ?!

గుడిసె యజమాని : అయ్య బాబోయ్! నువ్వేంటి ఇలా వచ్చావ్!

కొండ : నాకు ఊరు చూడాలనిపించి ఇలా వచ్చాను.

గుడిసె యజమాని : ______

కొండ : ______

గుడిసె యజమాని : ______

కొండ : ______

గుడిసె యజమాని : ______

SCERT TELANGANA

## V పదజాలం

### అ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి.

1) వినయ్ విమానంలో నుండి భూమి మీద ఉన్న వాటిని చూస్తూ ఎంతో అబ్బురపడ్డాడు. (                    )

2) రమ్య తరగతిలోకి రావడం ఆలస్యం అయ్యేసరికి తన స్థానంలో కీర్తి కూర్చున్నది. (                    )

3) మధ్యాహ్నం భోజనం తరువాత బడిలో పిల్లలు స్వేచ్ఛగా ఆడుకొంటారు. (                    )

4) శ్రవణ్‌కు దెబ్బతగిలితే వాళ్ళ అక్క కంగారుపడి గాయాన్ని బట్టతో తుడిచింది. అది శ్రవణ్‌కు ఇంకా ఎక్కువ బాధ కలిగించింది. (                    )

5) ఉపాధ్యాయులు విహారయాత్రకు వెళదామని చెప్పినప్పటి నుండి పిల్లలందరూ ఉత్సాహంగా ఆ రోజు కోసం ఎదురు చూడసాగారు. (                    )

### ఆ) కింది పదాలకు వచనాలు మార్చి రాయండి.

| | ఏకవచనం | | బహువచనం |
|---|---|---|---|
| 1) | చెట్టు | - | ________ |
| 2) | పక్షి | - | ________ |
| 3) | పొలం | - | ________ |
| 4) | రోడ్డు | - | ________ |
| 5) | అవధి | - | ________ |
| 6) | వాహనం | - | ________ |
| 7) | అప్పడం | - | ________ |
| 8) | మైదానం | - | ________ |

SCERT TELANGANA

ఇ) కింది గళ్ళ నుడికట్టులో పాఠంలోని కొన్ని పదాలు ఉన్నాయి. వాటిని వెతికి రాయండి.

| | | | | |
|---|---|---|---|---|
| వా | గు | లు | క్షు | ప |
| అం | డి | క | సి | రి |
| చు | సె | వం | పొ | స |
| న | రి | ఎ | లా | రా |
| మై | దా | నా | లు | లు |

1) ______ 6) ______

2) ______ 7) ______

3) ______ 8) ______

4) ______ 9) ______

5) ______ 10) ______

## VI భాషను గురించి తెలుసుకుందాం

అ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలు ఏ భాషాభాగానికి చెందినవో రాయండి.

1) పక్షులన్నీ ఆకాశంలో ఎగురుతున్నాయి. ( )

2) అది ఒక అందమైన ఊరు. ( )

3) శ్రీదేవికి గులాబీలంటే చాలా ఇష్టం. ( )

4) మన రాష్ట్ర రాజధాని హైదరాబాదు. ( )

5) కొండను చూసి అందరూ భయంతో పరిగెత్తారు. ( )

ఆ) కింది పేరా చదువండి. అందులోని నామవాచకం, సర్వనామం, క్రియాపదాలను పట్టికలో రాయండి.

రాము తన మిత్రుడు రహీం ఇంటికి వెళ్ళాడు. అక్కడ అతను బాతును, కోడిని చూశాడు. ఇవే కాక వాళ్ళ ఇంట్లో కుందేలును, తాబేలును, పావురాన్ని కూడా పెంచుకుంటున్నారు. రహీం తాబేలును రాముకు ఇచ్చాడు. ఇంతలో రాము చెల్లి అఖిల వచ్చింది. ఆమె కుందేలుతో ఆడుకొంది. వాళ్ళు అందరూ అమ్మ ఇచ్చిన జామకాయ ముక్కలు తిన్నారు.

SCERT TELANGANA

| నామవాచకం | సర్వనామం | క్రియ |
| --- | --- | --- |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

## VII ప్రాజెక్టుపని

ఏదైనా ఒక అద్భుత / జానపద కథను సేకరించి రాయండి. ప్రదర్శించండి.

### నేనివి చేయగలనా?

| | | |
| --- | --- | --- |
| 1) | నాకే రెక్కలు వస్తే ఏం చేయగలనో చెప్పగలను. | ఔను / కాదు |
| 2) | పేరా చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలను. | ఔను / కాదు |
| 3) | నేను కొండలాగ కదలకుండా ఒకే చోట ఉంటే ఎలా ఉంటుందో రాయగలను. | ఔను / కాదు |
| 4) | పదాలకు అర్థాలు రాయగలను, వచనాలు రాయగలను. | ఔను / కాదు |
| 5) | కొండకు, గుడిసె యజమానికి మధ్య జరిగిన సంభాషణ రాయగలను. | ఔను / కాదు |
| 6) | నామవాచక, సర్వనామ, క్రియా పదాలను గుర్తించగలను. | ఔను / కాదు |

### మంచి మాట

తనకు మాలిన ధర్మం పనికిరాదు.

SCERT TELANGANA

# పదాలు - అర్థాలు

**అ**

అంగుళం = బొటనవేలంత

అంచు = గట్టు, చివర, కొన

అంతర్వాహిని = పైకి కనపడకుండా ప్రవహించడం

అబ్బురం = ఆశ్చర్యం

అయోమయం = ఏమీ అర్థముకాని పరిస్థితి

అమాయకుడు = వెర్రిబాగులవాడు

అవధి = పొలిమేర, హద్దు

**ఆ**

ఆసక్తి = ఆపేక్ష, శ్రద్ధ

ఆస్థానం = రాజసభ

ఆది = మొదటి

ఆనందం = సంతోషం

ఆలయం = గుడి

ఆహ్లాదం = సంతోషం, ఉల్లాసం

**ఉ**

ఉత్త = వట్టి, శూన్యం

ఉత్సాహం = కోరిక, ఆత్రం, ప్రయత్నం

ఉల్లాసం = ఆనందం

ఉపాయం = యోచన, ఆలోచన

ఉరుకు = పరుగెత్తు

**ఊ**

ఊపిరి = గాలి, ప్రాణం

**ఎ**

ఎగాదిగా = కింది నుండి మీదికి

ఎగనామం = ఎగ్గొట్టడం

**ఒ**

ఒనరగ = ఒప్పునట్లుగ, చక్కగా

**క**

కంగారు = ఆందోళన, ఎటూపాలుపోని తనం

కడకు = చివరికి

కనకం = బంగారం

కలిమి = సంపద

కాంతి = వెలుగు, ప్రకాశం

కాలం = సమయం

కొలువు = సభ, ఉద్యోగం

**ఖ**

ఖలుడు = మూర్ఖుడు, నీచుడు

**గ**

గద్దించు = అదిలించు భయపెట్టు, జడిపించు

SCERT TELANGANA

గబుక్కున = వెంటనే

గుణం = స్వభావం, శీలం, ప్రవర్తన

గురువు = ఉపాధ్యాయుడు

గొప్పది = విలువగలది

గొల్లుమనడం = దుఃఖించడం, ఏడవడం

గౌరవం = గొప్పతనం

గ్రహించు = తెలుసుకొను

**ఘ**

ఘనము = గొప్ప

**చ**

చక్కగ = మంచిగా

చతురులు = నిపుణులు, తెలివైనవారు

చరిత్ర = పూర్వగాథ

**జ**

జాతి = కులం, స్థాయి

జాడ = విధం

జిడ్డు = మురికి, మలినం

**త**

తిండి = ఆహారం

త్రిలింగాలు = మూడులింగాలు

**ద**

దొరలు = ధనవంతులు, సంపన్నులు

**ధ**

ధనం = డబ్బు

**న**

నవ = కొత్త, నూతన

నిర్మాత = చేసేవాడు, సృష్టించేవాడు

నీతి = న్యాయమైనది

నేత = నాయకుడు, ప్రభువు

నేరుగా = సూటిగా, చక్కగా

**ప**

పచ్చదనం = ఆకుపచ్చని

పట్టం = రాజ్యాభిషేకం

పాపలు = పిల్లలు

ప్రపంచం = లోకం

ప్రశాంతం = శాంతం

ప్రసిద్ధమైన = పేరుగాంచిన

**ఫ**

ఫణి = పాము

**బ**

బాలలు = పిల్లలు

బెంగ = దిగులు, దుఃఖము

**భ**

భ్రాతృజనం = అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు

SCERT TELANGANA

**మ**

మందలించడం = హెచ్చరించడం, చివాట్లుపెట్టడం, పరామర్శించడం

మమత = ప్రేమ, అభిమానం

మార్గము = దారి, బాట

ముక్తి = దైవసన్నిధికి చేరుకోవడం

మురిపెం = గారాబంచేయు

మేటితనం = గొప్పదనం, అధికతరం

మైదానం = విశాలమైన పచ్చిక బయలు భూమి

మైలు = అరకోసు, 8 ఫర్లాంగులు

**ర**

రివ్వున = వేగంగా, శీఘ్రంగా

రైతు = వ్యవసాయము చేయువాడు

**ల**

లోకం = జగం, ప్రపంచం

**వ**

వనం = అడవి, తోట

వర్ధనం = అభివృద్ధి

వాగు = సెలయేరు, కాలువ

వానరులు = కోతులు

వూరు = గ్రామం

వికటకవి = హాస్యగాడు

వినయం = నమ్రత, విధేయత, అణకువ

విశ్వం = ప్రపంచం

విశ్వాసం = నమ్మకం

విశేషాలు = గొప్పవిషయాలు, ప్రత్యేక సంగతులు

వృశ్చికము = తేలు

**శ**

శాంతి = ఓపిక, సహనం

శుభం = మేలుకలుగడం

శునకం = కుక్క

శుభలగ్నం = మంచి ముహూర్తం

శ్రద్ధ = పట్టింపు

శ్రేష్ఠమైన = మంచిది

**స**

సంగమించు = కలుసుకొను

సంస్కృతి = జీవన విధానం

సంతోషం = ఆనందం, ఆహ్లాదం

సంబురం = ఆనందం, సంతోషం

సమత = సమానమైన

సమీపం = దగ్గర

సహజమైన = ప్రకృతికనుగుణమైనది, పుట్టుకతో వచ్చినది

సాదుకొను = పెంచుకొను

సాము = వ్యాయామం

సాయం = సహాయం

స్థానం = చోటు, ఉనికి

స్వేచ్ఛ = ఇష్టం ఉన్నట్లుగా, స్వతంత్రత

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22